
## పోలీస్ స్టేషన్ లో మారని వైనం..

. . . పాత ఎస్సై ట్రాన్స్ ఫర్ అయినా సమాచార హక్కు చట్టం బోర్డులో అదే పేరు




**రుద్రూర్, బతుకమ్మ :** రుద్రూర్ మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ లో సమాచార హక్కు చట్టం -2005 బోర్డులో పౌర సమాచార అధికారి పేరు ఇంకా మార్చలేదు. నిజామాబాద్ కు ట్రాన్స్ ఫర్ అయినా పాత ఎస్ఐ సాయన్న పేరు ఇప్పటి వరకు కూడా సమాచార హక్కు చట్టం బోర్డులో ఉండడం పట్ల పలు ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. రుద్రూర్ పోలీస్ స్టేషన్ లో నూతన ఎస్సై మనోజ్ కుమార్ బాధ్యతలు స్వీకరించి సుమారు నెలరోజులు గడుస్తున్నా ఇప్పటివరకు పోలీస్ స్టేషన్ లో సమాచార హక్కు చట్టం - 2005 బోర్డులో పౌర సమాచార అధికారిగా నూతన ఎస్సై పేరు మార్చాల్సి ఉండగా, పాత ఎస్ఐ పేరు ఉండడం పట్ల పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పోలీస్ స్టేషన్ లో సమాచార హక్కు చట్టం బోర్డులో పౌర సమాచార అధికారి పేరు మార్చాలని పలువురు కోరుతున్నారు.

## పిచ్చి మొక్కల నిర్మూలనకు పురుగుమందుల పిచికారీ

**నందిపేట్, బతుకమ్మ :** గ్రామంలో విచ్చలవిడిగా పెరిగిన పిచ్చి మొక్కల నిర్మూలన కోసం నందిపేట్ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక పిచికారీ కార్యక్రమం చేపట్టారు. గ్రామంలోని రోడ్ల వెంబడి, డ్రైనేజీల పరిసర ప్రాంతాల్లో పెరిగిన కలుపు మొక్కలు, పిచ్చి మొక్కలను తొలగించేందుకు పంచాయతీ సిబ్బంది కలుపు నివారణ మందు పిచికారీ చేశారు. 6, 7, 8 వార్డుల పరిధిలో ఈ కార్యక్రమం నిర్వహించారు. పిచ్చి మొక్కల వల్ల దోమల బెడద ఎక్కువై గ్రామస్తులకు ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉన్నందున, ముందస్తు జాగ్రత్త చర్యగా ఈ పిచికారీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పాలక వర్గ సభ్యులు తెలిపారు. రాబోయే రోజుల్లో గ్రామంలోని అన్ని వార్డుల్లో ఈ కార్యక్రమాన్ని కొనసాగించనున్నట్లు సర్పంచ్ సిలిందర్ ఎర్రం లింగం వెల్లడించారు. గ్రామస్తులు సైతం ఈ కార్యక్రమానికి సహకరించి, తమ ఇళ్ల పరిసరాల్లో కూడా పిచ్చి మొక్కలను తొలగించి, చెత్తను ఆటోలో వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చందర్, వార్డు సభ్యులు చింత రవి, షేక్ పాషా, చింత శ్రీనివాస్, కస్తూరి గంగాధర్, నాయకులు ఇమ్రాన్ ఖాన్, సిబ్బంది పాల్గొని పనులను స్వయంగా పర్యవేక్షించారు.



## ఉరి వేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య

**రుద్రూర్, బతుకమ్మ :** రుద్రూర్ మండలంలోని బొప్పాపూర్ గ్రామానికి చెందిన గొండలి శ్రీనివాస్ (40) అను వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు రుద్రూర్ ఎస్సై మనోజ్ కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన విరాల ప్రకారం.. బొప్పాపూర్ గ్రామానికి చెందిన గొండలి శ్రీనివాస్ గత కొన్ని సంవత్సరాలుగా మద్యానికి బానిసై మృతి చెందినట్లు ఎస్సై మనోజ్ కుమార్ పేర్కొన్నారు. మృతునికి ఇద్దరు కుమార్తెలు కలరు. మృతుని భార్య రమాదేవి ఫిర్యాదు మేరకు ఏసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.




# ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి అర్హులైన ఓటరు పాల్గొనాలి

. . . 36, 37 డివిజన్లలో ఎస్ఐఆర్ అవగాహన ర్యాలీ . . . కార్పొరేషన్ డీసీసీ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ

**నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :** ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి అర్హులైన ఓటరు భాగస్వామ్యం కావాలని, ఎన్యూమరేషన్ ఫారమ్‌లను సకాలంలో సమర్పించి ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్పొరేషన్ డీసీసీ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ అన్నారు. ఆదివారం 36, 37 డివిజన్లలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించే లక్ష్యంతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎస్ఐఆర్ అబ్జర్వర్ గన్ రాజ్ పర్యవేక్షణలో, బండారి రమేష్ సమన్వయంతో, 36వ డివిజన్ ఇంచార్జ్ విక్కీ యాదవ్, 37వ డివిజన్ ఇంచార్జ్ కరిపె శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో ఈ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కార్పొరేషన్ డీసీసీ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ హాజరయ్యారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి




స్థానికులను కలుస్తూ ఎస్ఐఆర్ ఎన్యూమరేషన్ ఫారమ్‌లకు సంబంధించిన సందేహాలను నివృత్తి చేశారు. అలాగే ప్రజలు తమ ఎన్యూమరేషన్ ఫారమ్‌లను సంబంధిత బూత్ లెవల్ అధికారి (బీఎల్ఓ)కు అందజేశారా లేదా అనే విషయాన్ని తెలుసుకుని, అవసరమైన వారికి



మార్గనిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో 43వ డివిజన్ కార్పొరేటర్ ఎర్రం గంగాధర్, 38వ డివిజన్ కార్పొరేటర్ ప్రవీణ్ యాదవ్, కోఆప్షన్ సభ్యులు బొబ్బిలి మురళి, ఈఆర్ఓ కోఆర్డినేటర్ వహీద్, ధాత్రిక భాస్కర్, ఆకుల వెంకటేష్, అష్రఫ్ తదితరులు పాల్గొన్నారు.

# వైద్యుడికి 'డిజిటల్ అరెస్ట్' నరకం..

. . . రూ.2 కోట్లు గుంజిన నర్స్ అరెస్ట్

**వెబ్ డెస్క్, బతుకమ్మ :** రోగుల ప్రాణాలు కాపాడేందుకు రాత్రింబవళ్లు శ్రమించే ఒక సీనియర్ డాక్టర్.. తన సొంత ఆసుపత్రిలోనే ఐదేళ్లకు పైగా తీవ్ర భయాందోళనల మధ్య 'డిజిటల్ బందీ'గా బతికాడంటే నమ్మగలమా? రాజస్థాన్‌లోని బార్మర్ జిల్లాలో వెలుగుచూసిన ఈ షాకింగ్ ఉదంతం ఇప్పుడు స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టిస్తోంది! బార్మర్‌కు చెందిన 65 ఏళ్ల ప్రైవేట్ ఆసుపత్రి వైద్యుడి వద్ద కమల అలియాస్ కమలేష్ అనే మహిళ 2016 నుంచి నర్సుగా పనిచేస్తోంది. నెలకు రూ.12 వేల జీతానికి పనిచేసే ఈ నర్స్, టీ తెచ్చే నెపంతో డాక్టర్ వ్యక్తిగత గదిలోకి ప్రవేశించి ఆయనకు తెలియకుండా రహస్య ఫొటోలు తీసింది. ఆ ఫొటోలను సోషల్ మీడియాలో పెడతానని, రేప్ కేసులో ఇరికిస్తానని, చంపేస్తానని బెదిరిస్తూ ఆయన నుంచి ఏకంగా రూ.2 కోట్ల వరకు గుంజినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఆసుపత్రి ప్రతిష్ఠ, తన పరువు పోతుందనే భయంతో డాక్టర్ విడతల వారీగా అడిగినంత ఇస్తూ వచ్చాడు. చివరికి ఆసుపత్రి ఖాతా నుంచే ఏకంగా రూ.35 లక్షలు ఆమె అకౌంట్‌కు బదిలీ చేయడం గమనార్హం. ఈ బ్లాక్‌మెయిలింగ్ అంతటితో ఆగలేదు. డాక్టర్‌ను పూర్తిగా తన గుప్పిట్లోకి తెచ్చుకునేందుకు ఆ నర్స్ అతడికి ఒక ప్రత్యేక మొబైల్ ఫోన్ ఇచ్చి, 24 గంటలు దాన్ని ఆన్‌లోనే ఉంచాలని 'డిజిటల్ అరెస్ట్' చేసింది. సీసీటీవీ కెమెరాల పాస్‌వర్డ్ లు తీసుకుని ఆసుపత్రిలో ఆయన కదలికలను ఎప్పటికప్పుడు గమనించేది. గుజరాత్‌లోని అహ్మదాబాద్ పర్యటనలో ఉన్నప్పుడు దాదాపు 1000 సార్లు ఫోన్ చేసి వేధించడమే కాకుండా, ఖాళీ చెక్కులు, స్టాంప్ పేపర్లపై బలవంతంగా సంతకాలు చేయించుకుని బ్యాంకు లాకర్లలో దాచుకుంది. బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు కమలేష్‌ను అరెస్ట్ చేసి, విచారణ వేగవంతం చేశారు. అయితే, ఆరోపణలన్నీ అబద్ధమని, తనను కావాలనే ఇరికిస్తున్నారని నిందితురాలు చెబుతుండటంతో పోలీసులు వీరిద్దరి మధ్య ఉన్న సంబంధాలపై లోతుగా ఆరా తీస్తున్నారు.



# రైస్ మిల్లు అడ్డాగా గంజాయి విక్రయాలు

– రుద్రూర్ లో గంజాయి పట్టి వేత... – సుమారు 5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్న పోలీసులు...

– ఇద్దరు నిందితుల అరెస్టు ...



**రుద్రూర్, బతుకమ్మ :** రుద్రూర్ మండల కేంద్రంలో చీత ఫోర్స్ అధికారులు మెరుపు దాడి చేసి గంజాయి పట్టుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. రైస్ మిల్లును కేంద్రంగా చేసుకుని గంజాయి విక్రయాలు సాగిస్తున్న ముఠాపై సిసిఎస్ ఏసిపి శ్రీశైలం ఆధ్వర్యంలో చీతా ఫోర్స్, సిసిఎస్ అధికారులు శనివారం మెరుపుదాడి నిర్వహించి సుమారు ఐదు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో బీహార్ కు చెందిన బల్వంత్ కుమార్ సింగ్ తో పాటు స్థానికుడు కోటగిరి కి చెందిన సంజీవ్ ను అదుపులోకి తీసుకుని, అనంతరం స్థానిక పోలీసులకు అప్పగించినట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. బీహార్ కు చెందిన బల్వంత్ కుమార్ సింగ్ బీహార్ నుంచి ఐదు కిలోల గంజాయిని కొనుగోలు చేసి రుద్రూరు గ్రామానికి తీసుకొచ్చినట్లు సమాచారం. అనంతరం స్థానికుడు సంజీవ్ ఆ గంజాయిని సుమారు రూ. లక్షకు కొనుగోలు చేసి, ఇద్దరూ కలిసి స్థానిక రైస్ మిల్లులో పనిచేసే కార్మికులను లక్ష్యంగా చేసుకుని చిన్న చిన్న ప్యాకెట్లుగా విక్రయిస్తున్నట్లు తెలిసింది. ఈ వ్యవహారంపై విశ్వసనీయ సమాచారం అందుకున్న చీతా ఫోర్స్ సిసిఎస్ ఎసిపి శ్రీశైలం ఆధ్వర్యంలో శనివారం ఆకస్మికంగా దాడి నిర్వహించి, ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి సుమారు ఐదు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను, స్వాధీనం చేసుకున్న గంజాయితో పాటు స్థానిక పోలీసులకు అప్పగించినట్లు తెలిసింది. ఇద్దరు వ్యక్తులను రిమాండ్ కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై మనోజ్ కుమార్ వెల్లడించారు.

